రంజాన్ వేళలు
ఇఫ్తార్ - బుధవారం
సాయంత్రం - 6:35
సహర్ - గురువారం
ఉదయం - 4:46

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో 'జనజాతర' పేరుతో మరోసారి భారీ బహిరంగసభ నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ మరోసారి తుక్కుగూడ సెంటిమెంట్‌గా సభ నిర్వహణకు సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి.

జనజాతరకు సన్నద్ధం!

- లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా ముందుకు
- హాజరు కానున్న అధినేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంకాగాంధీ
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన పార్టీ నేతలు
- సభకు 10లక్షల మంది తరలింపు..
- కాంగ్రెస్‌కు కలిసొచ్చిన తుక్కుగూడ!


సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

6న తుక్కుగూడలో కాంగ్రెస్ భారీ బహిరగ సభ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2) : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు గాను 14 స్థానాలకు పైగా గెలుచుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో సత్తా చాటాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో జనజాతర పేరుతో మరోసారి భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు వంద ఎకరాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. 50ఎకరాల్లో వేర్వేరు చోట్ల పార్కింగ్ స్థలాలను గుర్తించారు. కాంగ్రెస్‌కు రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం తుక్కుగూడ సెంటిమెంట్‌గా మారింది. ఈ వేదికపై గత ఏడాది సెప్టెంబరు 16, 17 తేదీల్లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ అసెంబ్లీ ఎన్నికలకు ఆరు హామీలను ఇక్కడి నుంచే విడుదల చేశారు. తెలంగాణలో తొలిసారి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఆ ఆరు హామీలు కీలకంగా మారిన విషయం విదితమే.

జన సమీకరణలో నిమగ్నం

జనజాతర బహిరంగ సభకు 10 లక్షల మంది ప్రజలను తరలించేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి పార్టీ నేతలు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జాతీయ స్థాయి నేతలు హాజరు అవుతుండడంతో అదే స్థాయిలో ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. జాతీయ కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోను ఇక్కడే విడుదల చేయనున్నారు. జాతీయ స్థాయిలో కార్యాచరణ ఇక్కడి నుంచే ప్రారంభించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది.

సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలన

బహిరంగ సభ ఏర్పాట్లను సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ హోదాలో దగ్గరుండి పరిశీలిస్తున్నారు. మంగళవారం ఆయన తుక్కుగూడలో పర్యటించారు. జనజాతర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో చనువుగా ఉన్నారు. ఇద్దరికి ఒకరంటే ఒకరు పడదనే ప్రచారానికి కూడా తెరపడింది. సభా ఏర్పాట్ల పరిశీలనలో ఒకే వాహనంపై వెళ్లారు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణను చూసిన పార్టీ నేతలు ఎంతో సంతోషపడ్డారు. సభా ఏర్పాట్లను సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ఏఐసీసీ నేత వంశీచంద్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, దేపభాస్కర్‌రెడ్డి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, సిద్దేశ్వర్, జానకిరాం, కాకి ఈశ్వర్, కూనయాదయ్య, తదితరులతో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నిర్వాహకులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు.

ప్రముఖుల హాజరు

జనజాతర బహిరంగసభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అధినేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ హాజరు కానున్నారు. అదే రోజున జాతీయ కాంగ్రెస్‌పార్టీ మెనిఫెస్టో విడుదల చేయనున్నారు. ఈ సభా వేదికగా పార్టీలోకి భారీగా చేరికలుంటాయని తెలుస్తోంది.


సభా వేదిక నిర్మాణానికి సాగుతున్న ఏర్పాట్లు


అయినాపూర్‌లో ట్యాంకర్ దగ్గర నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

తాగునీటి తంటాలు

దోమ, ఏప్రిల్ 2: దోమ మండలంలోని అయినాపూర్ 12వ వార్డులో తాగునీటి కోసం గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్‌భగీరథ తాగునీరు అంతంత మాత్రమే సరఫరా అవుతుండటంతో కాలనీ వాసులకు ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి సరఫరా బోర్లలో నీటిమట్టాలు తగ్గిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.

నడిపించే నాయకుడేడీ!

పరిగిలో కమలదళపతి లేక అయోమయంలో పార్టీ శ్రేణులు

- గతంలో కంటే అసెంబ్లీ ఎన్నికల్లో పరిగిలో పుంజుకున్న బీజేపీ
- లోక్‌సభ ఎన్నికలకు మరింత బలోపేతం దిశగా అడుగులు
- ప్రస్తుతం నాయకత్వలోపం.. గ్రూపులతో కుమ్ములాటలు

పరిగి,ఏప్రిల్2: పరిగి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీకి నాయకత్వ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి అనుకూల పవనాలు ఉన్నా పరిగిలో మాత్రం ఆ పార్టీని భుజస్కంధాలపై వేసుకుని నడిపించే నాయకుడు కరువయ్యాడు.నాయకత్వ లోపంతో ఏళ్లతరబడి పార్టీలో కొనసాగుతున్న కార్యకర్తలు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నడు లేనిధంగా 16వేలకుపైగా ఓట్లను సాధించింది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు రెండు రోజులకు ముందు చేతులెత్తయడంతోనే 16వేల ఓట్లు వస్తే, గట్టిగా పని చేస్తే రెండింతల ఓట్లు వచ్చే అవకాశం లేకపోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి రెట్టింపుగా అనుకూల పవనాలు కనిపిస్తున్నాయి. పరిగిలో గతంలో కంటే కూడా పార్టీ మెరుపడింది. ఓటర్ల నుంచి అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే నాయకత్వలోపమే అసలు సమస్యగా మారిందని స్వయంగా కార్యకర్తలే పేర్కొంటున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎక్కడ చూసినా ఎన్నికల చర్చలే కనిపిస్తున్నాయి. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశేశ్వర్‌రెడ్డిని బీజేపీ అధిష్ఠానం ముందుగానే ప్రకటించింది. ఒక దఫా పర్యటన కూడా పూర్తి చేశారు. ఈసారి బీజేపికి భారీ ఓట్లు పడేఅవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఒక వైపు నాయకత్వలోపం, మరోవైపు ఉన్న నాయకులు, కార్యకర్తల్లో గ్రూపులతో పార్టీకి నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. బీజేపీ ఆవిర్భావం నుంచి కూడా పరిగిలో సీనియర్ నేత కరణం ప్రహ్లాద్‌రావు పార్టీకి పెద్దదిక్కుగా కొనసాగారు. ఆయన కూడా గతంలో మాదిరిగా యాక్టీవ్‌గా పని చేయడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరణం కాకుండా పార్టీలో మొదటి నుంచి ఏపీ రాములు, జి.శ్రీనివాస్, ఘణపూర్ వెంకటయ్యగౌడ్, రాముయాదవ్, బి.రాంచందర్ యాక్టీవ్‌గా పని చేస్తున్నారు. శరత్‌రెడ్డి తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బి.మారుతికిరణ్‌కు కూడా అందరూ సహకరించలేదని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. అసెంబ్లీ కన్వీనర్‌గా కొనసాగుతున్న నర్సింహ ఉండగా, మరికొందరు తామే కన్వీనర్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. పార్టీలో కొనసాగుతున్న నాయకులంతా నాలుగు గ్రూపులుగా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొందరు కనిపించకుండాపోయిన నాయకుల్లో కూడా గ్రూపులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ తిరుగులేని శక్తిగా బలపడుతున్న తరుణంలో పార్టీలో నాయకుల మధ్య కుమ్ములాటలతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ బలపడుతున్న సమయంలో ఈ గ్రూపులు నష్టం చేకూర్చే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధిష్టానం పార్టీ శ్రేణులను ఏకతాటి పైకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వలసలకు తాత్కాలిక బ్రేక్!


అక్కడే ఉంటూ సైలెంట్‌గా మా కోసం పనిచేయండి

- వికారాబాద్‌లో కాంగ్రెస్ సరికొత్త స్ట్రాటజీ
- బీఆర్ఎస్ నుంచి రావాలనుకునే నేతలతో ముందస్తు అవగాహన
- చేరికలతో వర్గవిభేదాలు రాకుండా జాగ్రత్తలు

వికారాబాద్, ఏప్రిల్ 2: చేవెళ్ల లోక్ సభ ఎన్నికల సమయంలో వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి పోటీ చేస్తారని ఆమె వర్గీయులు భావించారు. సునీతామహేందర్ రెడ్డి ప్రజల్లోకి సైతం వెళ్లి ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే రంజిత్‌రెడ్డి పేరు ఒక్కసారిగా తెరపైకి రావడం, ఆ వెంటనే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడం చకచకా జరిగిపోయాయి. అయితే చేవెళ్ల పార్లమెంట్ నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి బరిలో దిగడంతో ఆయన వర్గం పరిస్థితి ఏంటీ?.. వారు రంజిత్‌రెడ్డి వెంట నడుస్తారా ? లేక బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతారా అనే చర్చ జోరుగానే కొనసాగింది. రంజిత్‌రెడ్డి పార్టీలో చేరినా.. ఆయన వెంట బీఆర్ఎస్ నుంచి వచ్చే కొత్త వారిని తీసుకోవద్దనే డిమాండ్ కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తమైంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాశనం కోరుకున్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రంజిత్‌రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ముందు నుంచి పార్టీ కోసం పని చేసిన మేమంతా ఏం కావాలంటూ పలు సందర్భాల్లో నాయకులు పలు సమావేశాల్లో బహిరంగంగానే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ నేతలు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మీరు ఇప్పుడే రావొద్దు.... బీఆర్ఎస్‌లోనే ఉంటూ మాకు ఎన్నికల్లో సహరించాలని కోరుతున్నారు. వాస్తవానికి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉందనే చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి వ్యవహరించారు. ఆ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్‌ను గెలిపించేందుకు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఈ క్రమంలో భారీగా డబ్బులు ఖర్చు చేయడంతో పాటు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, ముఖ్య కార్యకర్తలతో కలిసి చర్చించారు. ఆ సమయంలో వికారాబాద్ నియోజకవర్గంలో కొందరికి దగ్గరయ్యారు. రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో వీరంతా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు.

సైలెంట్‌గా మాకు సహకరించండి

వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన తన అంతరంగికులు, ముఖ్యనాయకులతో రంజిత్‌రెడ్డి చర్చించి సముదాయించినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లోకి ఇప్పుడే రావద్దని, ముందుగా లోక్‌సభ ఎన్నికలు పూర్తి చేసుకుందామని చెప్పినట్లుగా ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఎవరు ఎక్కడ ఉన్నారో.. అక్కడే ఉండి పనిచేయాలని చెప్పినట్లుగా చెబుతున్నారు. పార్టీ మారక పోయినా.. తన గెలుపు కోసం పనిచేయాలని, మీకు భరోసాగా తానుంటానంటూ రంజిత్‌రెడ్డి వారికి నచ్చజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల తరువాత పరిస్థితులన్నీ సర్దుకుంటాయని, మిగతా అంశాలపైన మరోసారి ఆలోచిద్దామని తెలియజేసినట్లుగా చెబుతున్నారు. పార్టీలకతీతంగా తనను అభిమానించే వారు తన గెలుపు కోసం పని చేయాలని ఆయన తన వర్గీయులను కోరినట్లుగా ప్రచారమవుతోంది.



పార్టీ మారకుండానే ?

గత అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలో అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి కోసం కృషి చేసిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి వర్గీయులు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మారకుండానే రంజిత్‌రెడ్డి విజయం కోసం క్షేత్ర స్థాయిలో పనిచేసేందుకు సిద్ధమైనట్లుగా తెలిసింది. నియోజకవర్గంలో కొందరు ముఖ్య అనుచరులు కాంగ్రెస్‌లో చేరకుండానే ఎన్నికల్లో పని చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి చేరికలు పెట్టుకోవద్దని.., ఎన్నికలు పూర్తయిన తరువాతనే చేరికల అంశంపై ఆలోచించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడే పార్టీలోకి వెళితే వర్గ విబేధాలు తలెత్తి ఎన్నికల్లో లేనిపోని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వారు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో లోక్‌సభ ఎన్నికలకు ముందుగా నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు ఉంటాయా ? లేదా అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

ప్రస్తుతం కొందరికే చోటు

వారం రోజుల కిందట హైదరాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సీనియర్ నాయకులు కొందరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ప్రయత్నించిన నాయకుడి కోసం ఈ ఎన్నికల్లో ఎలా పనిచేస్తామని, ఆయనతో వచ్చే వారిని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటామని బహిరంగంగానే మాట్లాడినట్లుగా తెలిసింది. అయితే ఈ సమావేశంలో ఉన్న రంజిత్‌రెడ్డి తనదైన శైలిలో అందరిని కలుపుకొనిపోతామని, పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని చెప్పడంతో సద్దుమణిగినటు సమాచారం. అయితే చివరగా మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి ఎవరినంటే వారిని తీసుకోకుండా ప్రస్తుతం ఒకరిద్దరు నాయకులను మాత్రమే పార్టీలోకి ఆహ్వానిస్తామని తెలిపినట్లుగా సమాచారం.


ఆసుపత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

డీహైడ్రేషన్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 2 : డీహైడ్రేషన్ (నిర్జలీకరణ) నివారణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ నారాయణరెడ్డి వైద్యాధికారులకు సూచించారు. అనంతగిరి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవుట్ పేషంట్, సిబ్బంది హాజరు పట్టిక, రిజిస్టర్లు, ఔషధ నిలువ గదిని పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాలకు సంబంధించి ఈడీడీలో నమోదు చేసిన గర్భిణుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సందర్భంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలన్నారు. ప్రతి ఆశావర్కర్, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది దగ్గర వందకు తగ్గకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. డిహైడ్రేషన్‌కు గురైన వ్యక్తులకు సత్వర వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ సృజన, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగా పోలింగ్ ప్రక్రియ

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కేంద్రాలను సందర్శించిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులు నిర్వహిచాలని తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్లు రామ్‌రెడ్డి, వీరకాంతం తదితరులు పాల్గొన్నారు.

రేపు బషీరాబాద్ మండల సర్వసభ్య సమావేశం

బషీరాబాద్, ఏప్రిల్ 2: మండల సర్వసభ్య సమావేశం రేపు(గురువారం) నిర్వహించనున్నట్లు బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరరవుతారన్నారు. డివిజన్, మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో పాటు ప్రత్యేకాధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రవాణాశాఖకు కాసుల పంట!

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 4449.14 కోట్లు
- రంగారెడ్డిలో అత్యధికంగా రూ.1688.78 కోట్లు
- రెండో స్థానంలో హైదరాబాద్ రూ. 1462.04 కోట్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రవాణాశాఖకు ఈ ఆర్థిక సంవత్సరం(2023-24)లో కాసుల పంట పండింది. వాహనాల పన్ను రూపంలో భారీ స్థాయిలో ఆదాయం సమకూరింది. వాహనాల లైఫ్‌ట్యాక్స్, ఫీజులు, సర్వీస్ చార్జీలతో పాటు గ్రీన్‌ట్యాక్స్‌లన్నీ కలిపి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో రికార్డు స్థాయిలో రవాణాశాఖకు రూ. 4,449.14 కోట్ల ఆదాయం వచ్చింది. రంగారెడ్డి నుంచి అత్యధికంగా రూ.1,668.78 కోట్లు, హైదరాబాద్ నుంచి రూ. 1,462.04, మేడ్చల్ నుంచి రూ.1298.33 కోట్లు ఆదాయం సమకూరింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖకు రూ.6,990 కోట్ల ఆదాయం సమకూరగా.. సింహభాగం (రూ.4450 కోట్లు) మూడు జిల్లాల నుంచే కావడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 6,390 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాదితో పోల్చితే 9.38 శాతం ఆదాయం పెరిగిందని అధికారులు తెలిపారు. గ్రేటర్ పరిధిలో ఖరీదైన కార్లతో పాటు ఫ్యాన్సీ నెంబర్లకు పెద్ద మొత్తంలో రవాణశాఖకు ఆదాయం వస్తుంది.

మేడ్చల్ జిల్లాలో పెద్దరాతియుగం నాటి సమాధులు

- 4వేల ఏళ్లనాటివంటున్న తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్‌పల్లెలో పెద్దరాతియుగం నాటి సమాధులను గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు తెలిపారు. ఆ ప్రదేశంలో నెలవైన గుండ్రటి రాళ్లు, పలకరాళ్లతో పాటు 12నుంచి14 అడుగుల ఎత్తులోని మెన్హిర్ల(నిటారుగా నిలబెట్టిన రాళ్లు)ను పరిశీలించిన అనంతరం అక్కడ పెద్ద ఎత్తున సమాధులున్నట్లు గుర్తించామని కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లాలో ఇటీవలకాలంలో పదితావుల్లో రాతిచిత్రాలు, పెద్దరాతి యుగం సమాధులు, రాతిపనిముట్లను తమ బృందం గుర్తించినట్లు బృందం సభ్యులు వివరించారు. కొన్నివేల ఏళ్ల చరిత్రకు సాక్ష్యమైన సమాధులను పరిరక్షించాలి అని తెలంగాణ వారసత్వశాఖ అధికారులను అహోబిలం కరుణాకర్, మహమ్మద్ నసీరుద్దీన్, కొరివి గోపాల్ తదితరులు కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 2: వికారాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు, గౌరవ వేతనం ప్రాతిపదికన వివిధ కేటగిరీల్లో పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.నాగమణి తెలిపారు. కాంట్రాక్టు ప్రతిపాదికన ఐదు ప్రొఫెసర్, 11అసోసియేటెడ్ పోస్టులు, ఆరు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు. గౌరవ వేతనంతో పనిచేసేందుకు ఖాళీగా ఉన్న 21 సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులు, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఈనెల 6వ తేదీన ఉదయం 9 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. వివరాలకు https://gmcvikarabad.org/ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె సూచించారు.

మూడోసారి దేశప్రధాని మోదీనే..

- పార్టీ మారిన రంజిత్‌రెడ్డికి బుద్ధి చెప్పండి
- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 2: దేశ ప్రధానిగా మూడోసారి ప్రధాని నరేంద్ర మోదీనే ఉంటారని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరన్‌కోట్, చంద్రవంచ, మల్కాపూర్, కోటబాస్పల్లి, ఐనెల్లి, జినుగుర్తి, గౌతాపూర్, చెంగోల్ గ్రామాల్లో ప్రజాఆశీర్వాద యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.. గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు ఇచ్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కిందన్నారు. దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మొన్నటి వరకు బీఆర్ఎస్ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి దేవుడి భూములను కబ్జా చేశారని ఆరోపించారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారినా రంజిత్‌రెడ్డిని ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు.


ప్రజా ఆశీర్వాదయాత్రలో ప్రసంగిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

డీసీసీబీ మాజీ చైర్మన్‌ను కలిసిన కొండా

మండలంలోని కోటబాస్పల్లి గ్రామానికి చెందిన మాజీ డీసీసీబీ చైర్మన్ సిరిగిరిపేట్ సాయిరెడ్డిని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కలిశారు. కోటబబాస్పల్లిలోని సాయిరెడ్డిని నివాసానికి వెళ్లి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇరువురు రాజకీయ విషయాలపై చర్చించుకున్నారు. అందరి ఆశీస్సులతో తాను ఎంపీ ఎన్నికల్లో గెలుస్తానని విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఉప్పరి రమేష్, గాజుల శాంత్‌కుమార్, మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, నాయకులు బొప్పి శ్రీహరి, సంజీవరెడ్డి, సంజీవరెడ్డి, అంతారం లలిత, విజయ్‌కుమార్, బంటారం భద్రేశ్వర్ శేఖాపురం ఆంజనేయులు, సూర్యకాంత్, చిరంజీవి, శ్రీకాంత్, మల్లికార్జున్, రవి, ప్రవీణ్ ఉన్నారు.

టమాట, కంది రైతులను ఆదుకుంటాం

తాండూరు: ఎంపీగా గెలిస్తే టమాట, కంది రైతులను ఆదుకుంటామని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన తాండూరులో మంగళవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. కందులు, టమోటాలకు గిట్టుబాటు ధర లభించే విధంగా కృషిచేస్తామని చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఫోర్‌లైన్ రోడ్, రవాణారంగ అభివృద్ధికి ప్రయత్నిస్తానని చెప్పారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తాండూరు నుంచి లింగంపల్లికి రైలులో సాధారణ బోగిలో వెళ్లారు.

చేవెళ్ల అభివృద్ధి కోసం మరో అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్ జైలుకె

ళ్లడం ఖాయం : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 2 : ప్రజలకు సేవ చేయాలనే తాను రాజకీయల్లోకి వచ్చానని, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్న తనను ప్రజలు మరోసారి ఎన్నికల్లో ఎంపీగా గెలిపించాలని చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం పార్టీ ఇన్‌చార్జి భీంభరత్ అధ్యక్షతన నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్రలో నిలిచేలా రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలో ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజారంజక పాలన అందిస్తున్నారని అన్నారు. బూత్‌స్థాయి నాయకులు పార్టీకి గుండెకాయ లాంటివారని అన్నారు. కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరంగా ఉందన్నారు. హైదరాబాద్-బీజాపూర్ రహదారి పనులు త్వరలోనే పనులు చేపడుతారన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ ఉంటుందన్నారు. వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తేవాలన్నారు. 200యూనిట్ల వరకు ఎవరూ కరెంటు బిల్లు కట్టొద్దన్నారు. లోక్‌సభ ఎన్నికలు కాగానే పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుకు పోవడం ఖాయం అన్నారు. సమావేశంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు పి.వెంకట్‌స్వామి, పీసీసీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పీసీసీ కార్యదర్శులు జానార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు వసంతం, దర్శన్, జ్యోత్స్న, బల్వంతరెడ్డి, బందారు ఆగిరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, డి.సమతారెడ్డి, సరితారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బి.శైలజాఆగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా తన 60సంవత్సరాల జీవితంలో తనపై ఒక్క కేసు కూడా లేదని, ఓర్వలేని మాజీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనపై కేసు పెట్టారని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఓడిపోగానే ప్రజల్లో కన్పించకుండా ఇప్పుడు ఓట్ల కోసం ఆయన గ్రామాల్లో తిరుగుతున్నారని ఆరోపించారు. గతంలో ఎంపీగా విశ్వేశ్వరెడ్డి ఏమీ చేయలేదనేది ప్రజలకు తెలుసన్నారు. అభివృద్ధిపై తనతో బహిరంగ చర్చకు రావాలని ఎంపీ సవాల్ విసిరారు. అబద్ధాలతో విశ్వేశ్వర్‌రెడ్డి మోసం చేసి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి


నిరసన వ్యక్తం చేస్తున్న మిషన్ భగీరథ ఉద్యోగులు

ఆరునెలలుగా పెండింగ్‌లో వేతనాలు

- మిషన్ భగీరథ ఉద్యోగుల నిరసన

పరిగి, ఏప్రిల్ 2: ఆరు నెలలుగా తమకు వేతనాలు రావడంలేదని మిషన్ భగీరథలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం పరిగిలోని మిషన్‌భగీరథ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ హెల్పర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ నుంచి గత ఆగస్టులో మిషన్‌భగీరథ శాఖలోకి మార్చారని తెలిపారు. మిషన్‌భగీరథలో ఎనిమిది నెలలుగా పనిచేస్తుంటే కేవలం రెండు నెలల జీతం మాత్రమే వచ్చిందని తెలిపారు. ఆరునెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. వేతనాలు రాకపోతే జీవనం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జంగయ్య, బి.సుజాత, రాములు, ప్రకాశ్, హన్మయ్య, శేఖర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దామగుండం రామలింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



పూడూరు, ఏప్రిల్ 2: మండలంలోని దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు నేటి(బుధవారం)నుంచి ప్రారంభం కానున్నట్లు అర్చకులు బీమాచారి, నర్సింహాచారిలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(బుధవారం) నుంచి ఈనెల 7వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. నేడు ఉదయం 11గంటలకు అఖండ దీపారాధన, ధ్వజారోహణం, రేపు(గురువారం) తెల్లవారు జామున అగ్నిగుండం, రుద్రాభిషేకం, సాయంత్రం 6 గంటలకు పార్వతీ, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, రాత్రి 10గంటలకు రథోత్సవం, 5వ తేదీన ఉదయం 10గంటలకు బిల్వపుష్పార్చన, రాత్రి 9గంటలకు దీపోత్సవం, 6వ తేదీన ఉదయం 6గంటలకు రుద్రాభిషేకం, సహస్రపుష్పార్చన, 7వ తేదీన ఉదయం 6గంటలకు రుద్రాభిషేకం, 10.30గంటలకు చక్రతీర్థ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైన ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు ఎమ్మెల్యే సబితారెడ్డి వినతి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 2 : కష్టాల్లోని రైతులను ఆదుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సహచర ఎమ్మెల్యేలతో కలిసి కొంగర కలాన్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, రైతు భరోసాను అమలు చేయాలని, రైతులకు 2లక్షల రైతు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కరెంట్, నీళ్లు ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యం అని, ఇది ప్రకృతి కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు అని తెలిపారు. గత డిసెంబర్ 9నే 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి చేయలేదని, రైతుబంధును పెంచుతాం అని ఎకరాకు 5వేలు కూడా పూర్తిగా ఇవ్వలేదని విమర్శించారు. క్వింటాలు ధాన్యానికి 500 బోనస్ ఇస్తామని చెప్పారని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిలుపు మేరకు రైతుల సమస్యలపై నిరసన దీక్షలు, ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికెపుడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, యాదయ్య, జడ్పీటీసీ జంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ముగింపు వేడుకల్లో నిర్వాహకులు, భక్తులు

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

తలకొండపల్లి, ఏప్రిల్ 2: చీపునుంతలలో నిర్మించిన శివ సీతారామాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు మంగళవారం ముగిశాయి. 3రోజుల పాటు నిర్వహించిన గణపతి, సుబ్రహ్మణ్య, శివ, నంది, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, ధ్వజ స్తంభ, ప్రతిష్ఠ వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు శ్రీనివాసశర్మ, నర్సింహశర్మ, రాజుశర్మలు పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి రూ.10వేలు అందజేశారు. నాయకులు జనార్ధన్‌రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, లింగంగౌడ్, లాలయ్యగౌడ్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

షాబాద్, ఏప్రిల్ 2: రంజాన్ నెలలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, మత గురువు చెన్నాబాయి అన్నారు. మంగళవారం వారి ఆధ్వర్యంలో షాబాద్, మీరాపూర్ మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోదరభావానికి ఇఫ్తార్‌లు దోహదం చేస్తాయన్నారు. కుల మతాలకు అతీతంగా పండగలు నిర్వహించుకుంటేనే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. సౌభ్రాతృత్వానికి భారత్ వేదిక అన్నారు. మీరాపూర్ ఇఫ్తార్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పీసీసీ మెంబర్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్, మాజిద్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో కూలీల సంఖ్య పెంచాలి

- గరిష్ట వేతనం పొందేలా చర్యలు తీసుకోవాలి
- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 2: ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఉపాధిహామీ కూలి అత్యధికంగా రూ.300కు పెంచినట్లు తెలిపారు. ప్రస్తుత సమయంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధిలేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్య పెంచడం ద్వారా వారికి మేలు జరుగుతుందన్నారు. కూలీలందరూ నామమాత్రంగా గంట రెండు గంటలు పని చేసేవిధంగా ఎక్కువ సమయం కూలీ పనులు చేస్తే రూ.300 వేతనం కూలి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులను గుర్తిస్తూ కూలీలకు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీదేవి, ఎంపీవో మోహన్, ఏపీవో మల్లికార్జున్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాలు, నాభిశిల ప్రతిష్ఠాపన

షాబాద్, ఏప్రిల్ 2: రుద్రారంలో మూడు రోజుల పాటు నిర్వహించే గణపతి, ఈశ్వర, నవగ్రహ, నాభిశిల ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గణపతి పుణ్యాహవచనం, యాగశాలప్రవేశం, దేవతాహ్వానం, జలాధివాసం కార్యక్రమాలను వేదపండితుల నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వర్ణలతసతీష్, సంజీవరెడ్డి, ఆర్.మహేందర్‌రెడ్డి, నర్సింహులు, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న వేదపండితులు, గ్రామస్తులు


ఐటీబీపీ అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలి

- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 2: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి ఐటీబీపీ అధికారులను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు జిల్లాకు వచ్చిన ఐటీబీపీ ఎస్పీ ఆజోల్లీఛార్స్, డీఎస్పీ సందీప్ కాల్కల్ మంగళవారం వికారాబాద్ ఎస్పీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాకు వచ్చిన రెండు ఐటీబీపీ కంపెనీలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి సున్నిత, అతి సున్నిత అంశాలపైన ఎస్పీ వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ యు.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించాలి

- డీఎల్పీవో శంకర్‌నాయక్


గౌతాపూర్‌లో మురుగునీటి కాల్వను పరిశీలిస్తున్న శంకర్ నాయక్

తాండూరు రూరల్, ఏప్రిల్ 2: వేసవిలో తాగునీటి సమస్యలపై గ్రామాల్లో ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలని డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని గౌతాపూర్, చెంగోల్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శుల ద్వారా పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటిని గ్రామంలో సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయాశాఖల అధికారులు, ప్రత్యేకాధికారుల సమన్వయంతో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గౌతాపూర్ ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రావడంలేదని కాలనీవాసులు ఫిర్యాదు మేరకు డీఎల్పీవో పరిశీలించారు. పైప్‌లైన్ సరిగ్గా లేకపోవడంతో ఆశాఖ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వైఎస్ ఎంపీపీ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 2: మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రె జంగమ్మ ఎన్నికలకోడ్‌ను ఉల్లంఘించి సోమవారం కొత్త బోరు మోటార్‌ను ప్రారంభించారు. మండలంలో కాచవానిసింగారం, మహేశ్వరినగర్‌లో గ్రామ పంచాయతీ నిధులతో బోరు వేయించారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి బోర్ మోటార్‌ను బిగించి అనంతరం ప్రారంభించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు పంచాయతీ కార్యదర్శి సమక్షంలో నూతన బోర్‌మోటార్‌కు కొబ్బరికాయలు కొట్టి ఎలా ప్రారంభిస్తారని పలువురు నాయకులు ఆరోపించారు. ఎన్నికల అధికారులు సంబంధింత అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి నూతన బోర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ

మాదిగలకు ఎంపీ టికెట్లు కేటాయించాలి

ఇబ్రహీంపట్నం, మార్చి 2 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఎంపీ టికెట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు కేటాయించాలనే డిమాండ్‌తో మంగళవారం ఇబ్రహీంపట్నంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. రాష్ట్రంలో మాదిగలకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వలేదన్నారు. మాదిగ ఉపకులానికి చెందిన కడియం శ్రీహరి కూతరు కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చారని, 40ఏళ్లుగా రాజకీయ పదువులు అనుభవిస్తూ ఆర్థికంగా ఎదిగిన శ్రీహరి కుటుంబానికే మళ్లీ టికెట్ ఇచ్చారని, పేద మాదిగలకు అవకాశం ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహ, శ్రీకాంత్, కాల్ల జంగయ్య, పాండు, మహేష్ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 2: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని జమియామజీదులో ఉస్మాన్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, నాయకులు ఎండీ ఉస్మాన్, దస్తగిరి పటేల్, ఆష్రఫ్, సాహెద్ పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి ప్రార్థించడం అభినందనీయం



ఇఫ్తార్ విందులో నాయకులు

మేడ్చల్ టౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు కఠోర ఉపవాసదీక్షలు చేపట్టి ప్రపంచ శాంతి కోసం ప్రార్థించడం అభినందనీయమని మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌గౌడ్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయేందర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, సాయిపేట శ్రీనివాస్‌యాదవ్, రమణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర కల్పించాలి



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు వరికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వరి ధాన్యానికి మద్దతు ధర పైన రూ.500అదనంగా ఇవ్వాలని కోరుతూ డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్, ఆ పార్టీ నాయకులు జహంగీర్, పీర్జాదిగూడ మేయర్ వెంకటిరెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు వినతిపత్రం అందజేశారు.

అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీ, బిడ్డ

బషీరాబాద్, ఏప్రిల్ 2: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో ప్రసవించింది. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన మార్గం అగ్గనూర్ వద్ద చోటు మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మండలంలోని మర్పల్లి గ్రామానికి చెందిన సునీతకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. ఆమెను అంబులెన్స్‌లో తాండూరులోని మాతాశిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో అగ్గనూరు వద్దకు రాగానే పురిటినొప్పులు అధిక మయ్యాయి. పైలట్ ఇబ్రహీం వాహనాన్ని పక్కకు నిలపగా సునీత ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ హరీష్ తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుంటే చర్యలు తప్పవు



మేడ్చల్ మున్సిపల్ పరిధిలో వ్యాపార సముదాయల్లో తనిఖీ నిర్వహిస్తున్న కమిషనర్ నాగిరెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 2: మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పొందని వ్యాపార సముదాయాలపై తగు చర్యలు తీసుకుంటామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని మార్కెట్‌లోని వ్యాపార సముదాయాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్న దుకాణాల వ్యాపారస్తులు వారం రోజుల్లోపు లైసెన్స్ పొందాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ కోసం నేరుగా మున్సిపల్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని లేక మున్సిపల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ శుద్ధి

కొడంగల్, ఏప్రిల్ 2: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అర్చకులు శుద్ధి చేశారు. 44వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం కోవిల్ అల్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కుంకుమ, పసుపు, చందనం, కర్పూరం లాంటి సుగంధ ద్రవ్యాలతో ఆలయాన్ని శుద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ సంవత్సరం తిరుమల తిరుపతికి అనుసంధానంగా కొడంగల్‌లో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 4గంటలకు శ్రీ విశ్వక్సేన స్వామివారి తిరుచ్చి ఉత్సవం దేవాలయం నుంచి కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల పారువేట మండపం వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం పారువేట మండపంలో మస్త్యాంగ్రహనం, అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

గెస్ట్‌లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, ఏప్రిల్ 2: తమ సమస్యలు పరిష్కరించాలని గెస్ట్ లెక్చరర్లు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమకు ఆటో రెన్యువల్‌తో పాటు సర్వీస్ కంటిన్యూ చేసి పీరియడ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 12నెలలకు కన్సాలిడేట్ పే ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా రూ.50వేల వేతనం చెల్లించాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ అధ్యాపక బృందం అధ్యక్షుడు కృష్ణ, అధ్యాపకులు ప్రభు, కిషన్‌రావు, సుజాత, శ్వేత, స్వప్న, మహేశ్వరి బి.కృష్ణయ్యలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్ పేదల మనిషి



కులకచర్ల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్థంతి వేడుకల్లో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు



తాండూరు రూరల్: గౌతాపూర్‌లో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ పేద ప్రజల మనిషి అని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే కృష్ణయ్యగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుమలపూర్ రాములుగౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోల్కొండ సామ్రాజ్య స్థాపకుడు, పేద ప్రజలకు నేనున్నానని ధైర్యం కల్పించిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య గౌడ్, బీజేపీ నాయకులు గాదే మైపాల్, శివకుమార్‌గౌడ్, విజయ్‌గౌడ్, రజక సంఘం నాయకులు వెంకటేశ్, దళితసంఘాల నాయకులు వెంకట్రాములు, జోగు రామచంద్రయ్యగౌడ్, రాములు, లింగంగారి రాములు, బైరం భీమయ్య గౌడ్ పాల్గొన్నారు.

తాండూరురూరల్: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మండలంలోని గౌతాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గౌడ కులస్తులు మంగళవారం పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్ మాట్లాడుతూ అగ్రకుల పెత్తనాన్ని అణిచివేసేందుకు బహుజనులందరినీ ఏకం చేసిన వ్యక్తి పాపన్నగౌడ్ అని కొనియాడారు. పాపన్న ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం, రిటైర్డ్ ఏఎస్ఐ వెంకటయ్యగౌడ్, మహేష్‌గౌడ్, బాలయ్య, రాజుగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ సంఘం బంట్వారం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, జగదీశ్వర్‌గౌడ్, బిక్షపతిగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బంట్వారం: సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి


- పరిగి ఎంపీపీ అరవింద్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరవింద్‌రావు

పరిగి, ఏప్రిల్ 2: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండి, చర్యలు తీసుకోవాలని పరిగి ఎంపీపీ కె.అరవింద్‌రావు అన్నారు. పరిగి మండల పరిషత్‌లో మంగళవారం నిర్వహించిన మండలసభలో ఎంపీపీ మాట్లాడారు. వచ్చే రెండునెలల్లో సమస్య మరింత ఝటిలంగా మారే అవకాశముందన్నారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. సమస్య తీవ్రతను బట్టి సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. నీటి విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఖుదావంద్‌పూర్‌లో ఏళ్లుగా నీటి సమస్య ఉన్నదని, ఐదేళ్ల నుంచి అడుగుతున్నా సమస్యను పరిష్కరించడం లేదని ఎంపీటీసీ బి.ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన పదవీకాలం ముగియడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై ఎంపీపీ స్పందిస్తూ డీఈఈపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాన్ని సందర్శించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. నీళ్ల, విద్యుత్, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు గ్రామాలను సందర్శించి సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్‌భగీరథ డీఈఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. నీటి సమస్యల పరిష్కారానికి పరిగి సబ్ డివిజన్‌కు రూ.98లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పాత బోర్లను ఫ్లెస్సింగ్ చేసి వాడుకలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బి.హరిప్రియ, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ సుదర్శన్‌రెడ్డి,సుబ్రహ్మణ్యం, ఇర్ఫాన్, ఏఈ ఎండీ ఖాజా, ఏవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న గౌరి సతీష్

వికారాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీజేఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు గౌరి సతీష్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో టీపీజేఎంఏ, టీపీడీఎంఏ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశానికి ఆయనతో పాటు టీపీసీసీ మేధావుల ఫోరం చైర్మన్ శ్యాంమోహన్, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, ప్రొఫెసర్ జానయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీజేఎంఏ అధ్యక్షుడు గౌరి సతీష్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర టీపీడీఎంఏ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డిలు జూనియర్ కళాశాలల సమస్యలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వివరించారు. తొమ్మిదేళ్లుగా అప్పటి ప్రభుత్వం విద్యారంగాన్ని ఎలాంటి సమీక్షలు లేకుండా విస్మరించిందన్నారు. ప్రజా పాలనను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిశీలించి టీపీజేఎంఏ, టీపీడీఎంఏ ప్రతినిధుల భాగస్వామ్యంతో సమీక్షిస్తామని, మేనిఫెస్టో కమిటీతో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు గౌరి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీజేఎంఏ రాష్ట్ర కోశాధికారి పార్థసారథి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లాల బాధ్యులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలుపునకు సహకరించాలి



గుండ్లపోచంపల్లిలో ఈటల రాజేందర్ ప్రచారం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 2: బీజేపీని గెలిపించడానికి అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందించాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ కోరారు. ఆయన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుల సంఘాల పెద్దలు, యువజన సంఘాల నాయకులు, కాలనీల సొసైటీల సభ్యులను కలిసి తనకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ నరేంద్రమోదీ హవా కొనసాగుతోందన్నారు. పది సంవత్సరాల పాటు బీజేపీ చేపట్టిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాలు చక్కబడ్డాయన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. తనను ఆదరించి పార్లమెంట్‌కు పంపితే మేడ్చల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గం నాయకుడు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కూలీలతో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి, ఏప్రిల్ 2: ఉపాధిహామీ పథకంలో కొలతలు వేయడం వెంటనే నిలిపివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిట్టకోడూరు గ్రామంలోని ఉపాధి కూలీలతో మంగళవారం మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిట్టకోడూరు గ్రామంలో పని చేస్తున్న కూలీలలకు గత వారాలుగా డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూలీల పనిని మెజర్‌మెంట్ చేయడం తగదన్నారు. నెలలుగా రాకపోతే వడ్డీతో చెల్లించాలని చట్టం చెబుతున్నా అధికారులు అమలు చేయడం లేదన్నారు. ఉపాధి కూలీలకు ప్రమాదబీమా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాంచంద్రయ్య, రాజు,పెంటయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లింపులకు 5శాతం రాయితీ

తాండూరు, ఏప్రిల్ 2: ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించి ఒక రాయితీ పోను మరొక రాయితీ అవకాశం ఈ రాష్ట్రం ప్రభుత్వం కల్పించింది. ఎన్నో సంవత్సరాలుగా బకాయిలు పడిన వారికి 90శాతం వడ్డీ రాయితీగా మార్చి 31వరకు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పించిన విషయం విదితమే. ఆ గడువు ముగియడంతో తాజాగా మరో అవకాశం కల్పించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఎర్లీ బర్డ్ స్కీం కింద 5శాతం రాయితీని కల్పిస్తూ మున్సిపల్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మంగళ వారం నుంచి ఐదు శాతం కింద ఆస్తి పన్నులను వసూలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో మున్సిపల్ యంత్రాంగం, సిబ్బంది అంతా కలిసి మళ్లీ ఆస్తి పన్ను వసూలుకు బయల్దేరారు. జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్, మున్సిపాలిటీలో ఎర్లీబర్డ్ స్కీం కింద ఆస్తి పన్నువసూలుకు ప్రణాళికను రూపొందించారు. అధికారులు లక్ష్యాలకు అనుగుణంగా వసూలు చేయాలని బిల్ కలెక్టర్లకు టార్గెట్లు విధించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటును పూర్తి చేయాలి

కులకచర్ల, ఏప్రిల్ 2: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో, ఏపీయం, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను బుధవారం ఎంపిక చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కొనసాగుతుందని, కన్వీనర్‌గా హెచ్ఎం ఉంటారని, ప్రతీ తరగతి నుంచి విద్యార్థుల తల్లులు ముగ్గురు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 66 ఉన్నాయని, వాటన్నింటికి ఎన్నిక నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ఏపీయం శోభ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, ఏప్రిల్ 2: శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం చేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద కొంపల్లికి చెందిన జెంత కృష్ణ లావణ్య దంపతులు, వారి కుటుంబసభ్యులు సాయికుమార్‌గౌడ్-జ్యోతి, లక్ష్మణ్‌గౌడ్-లాస్యా, మధుకర్‌గౌడ్, ప్రణన్య, సాన్విక, శ్రీహిత, సాహర్ష్‌గౌడ్‌లు అన్నదానం చేశారు.

బస్టాండ్‌లో నీటిఎద్దడి



కులకచర్ల బస్టాండ్‌లో వృథాగా ఉన్న కూలర్‌ను చూపిస్తున్న విద్యార్థులు

కులకచర్ల, ఏప్రిల్ 2: కులకచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో నీటి ఎద్దడి కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రయాణికులు పరిగి, పాలమూర్ విద్యార్థులు వెళ్తుంటారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నీటిసమస్యను పరిష్కరించకుంటే ధర్నా చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

మేడ్చల్‌టౌన్, ఏప్రిల్ 2: మద్యానికి బానిసై కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మేడ్చల్ పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడి భార్య అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మేడ్చల్ పట్టణంలో కూలీగా పనిచేస్తున్న జగదీష్(30) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి తప్పతాగి ఇంటికి వచ్చిన జగదీష్ రాత్రి 12గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కోసం గాలించారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం చెరువు వద్ద జగదీశ్ మృతదేహం తేలియాడటంతో స్థానికులు సమాచారం అందించారు. దీంతో పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వికారాబాద్, ఏప్రిల్ 2: మండలంలోని ఎర్రవల్లి గ్రామచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతైన ఎరుకల చిన్న అనంతయ్య(60)మృతదేహం లభ్యమయింది. సోమవారం రాత్రి వరకు బోటు, గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా రాత్రి 11గంటల సమయంలో అనంతయ్య మృతదేహం లభ్యమైంది. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

చిరుతదాడిలో నాలుగు మేకలు మృత్యువాత

కులకచర్ల, ఏప్రిల్ 2: గోరిగడ్డ తండాలో చిరుత దాడిలో నాలుగు మేకలు మృత్యువాతపడ్డాయి. దీంతో తండా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తండాకు సమీపంలో ఉపాధిహామీ నిధులతో మేకల షెడ్‌ను నిర్మించారు. అందులో తండాకు చెందిన దేవ్‌సింగ్, బుద్యానాయక్‌లు మేకలను కట్టేసేవారు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి మేకలను కట్టేశారు. ఉదయం వెళ్లి చూడగా దేవ్‌సింగ్‌కు చెందిన నాలుగు మేకలు మృత్యువాతపడి ఉన్నాయి. చిరుత అర్ధరాత్రి షెడ్డులోకి చొరబడి మేకలపై దాడి చేసి ఉండొచ్చని బాధితులు అనుమానిస్తున్నారు. మృత్యువాతపడిన మేకల విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. బతుకుదెరువు నిమిత్తం తెచ్చుకున్న మేకలు మృత్యువాతపడటంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చిరుతదాడిలో తండాతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

శివారెడ్డిపల్లి గ్రామ సమీపంలో జింక..



శివారెడ్డపల్లిలో మృత్యువాతపడిన జింక

దోమ, ఏప్రిల్ 2: శివారెడ్డిపల్లి గ్రామ సమీపంలో జింక మృత్యువాత పడింది. దుర్వాసన రావడంతో గ్రామస్తులు గుర్తించారు. జింక కుక్కల దాడిలో మృతిచెందిందా లేదా ఏదైనా అడవి జంతువు దాడి చేసిందా? అని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పట్ల గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 2: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని లగచర్ల గ్రామ శివారులో మంగళవారం ఓ ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదుతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆసుపత్రిలో గుర్తు తెలియని మహిళ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ

వికారాబాద్, ఏప్రిల్ 2: వికారాబాద్ ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని ఓ మహిళ చికిత్స పొందుతోంది. ఆమె తన పేరు సరోజ అని చెపింది. అయితే మిగతా వివరాలు ఏమీ చెప్పడంలేదు. 65 సంవత్సరాల వయస్సు కలిగిన ఆమె గురించి వివరాలు తెలిసిన వారు వికారాబాద్ పోలీసు ఇన్‌స్పెక్టర్ సెల్ 8712670039కు కాల్‌చేసి తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కులకచర్ల, ఏప్రిల్ 2: విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాతపడింది. ఈ ఘటన కులకచర్ల మండలంలోని బిందెంగడ్డ తండా పంచాయతీ పరిధిలోని చింతలకుంట తండాకు చెందిన రాములు ఆవును మంగళవారం సాయంత్రం మేత మేసేందుకు వదిలాడు. ఆవు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడింది. మృతి చెందిన ఆవు విలువ రూ.50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వీర భద్రారెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న కేటీఆర్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 2: బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు వీరభద్రారెడ్డిని మేడ్చల్ మున్సిపల్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ పార్టీలో సేవలందించిన వీరభద్రారెడ్డిని కేటీఆర్ అభినందించారు.

అస్పత్రి ఎదుట శానిటేషన్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న శానిటేషన్ కార్మికులు

పరిగి, ఏప్రిల్ 2: పరిగి ప్రభుత్వ అస్పత్రిలో శానిటేషన్ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ, మంగళవారం అస్పత్రి ఎదెట ధర్నా నిర్వహించారు. కార్మికులు చేపట్టిన ధర్నా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ, పరిగి అస్పత్రిలో శానిటేషన్ కార్మికులకు గత నాలుగు నెలల నుంచి ఇవ్వకపోతే జీవనం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఈఎస్ఐ, పిఎఫ్ కూడా చెల్లించలేదన్నారు. నెలల తరబడి వేతనాలు రాకపోతే అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు మహేందర్,రాంబాబు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయండి

పెద్దేముల్, ఏప్రిల్ 2 : ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు హరీష్‌గౌడ్ పేర్కొన్నారు. పెద్దేముల్ మండలంలో ఈనెల 4వ తేదీన మండలవ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ప్రజాఆశీర్వాద యాత్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు.